నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, గురువారం 11 ఏప్రిల్ 2024 | VIKARABAD


బస్ స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న బీడీ టీమ్

## వికారాబాద్‌లో బీడీ టీమ్ తనిఖీలు


వికారాబాద్, ఏప్రిల్ 10 : లోక్ సభ ఎన్నికల దృష్ట్యా బుధవారం ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు బీడీ (బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్) టీమ్ అధికారులు వికారాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఎక్కడైనా మత్తు, పేలుడు పదార్థాలు రవాణా జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలని, లేదా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు.


జెండా ఊపి 2కె రన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్, రంగారెడ్డి కలెక్టర్ శశాంక

- బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆశీర్వాద యాత్రకు స్పందన కరువు
- ప్రచారంలో ముందున్నా ఆదరణ అంతంతే..
- యాత్రకు జనాలను రప్పించేందుకు ఒక్కొక్కరికి రూ.200 ఇస్తున్న నేతలు
- జనసమీకరణ విషయమై స్థానిక నేతలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కొండా


జనం లేక వెలవెలబోతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆశీర్వాద యాత్ర

# క్యాడర్.. 'కొండ'ంత దూరం..



వికారాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అందరి కంటే ముందున్న చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రచారానికి స్పందన కరువైంది. ఆశీర్వాద యాత్ర పేరిట ప్రచారం మొదలుపెట్టిన ఆయనకు ఆదరణ అంతంత మాత్రంగానే ఉన్నది. అసలే క్యాడర్ లేని బీజేపీకి డబ్బులిచ్చినా జనసమీకరణలో స్థానిక నేతలు విఫలమవుతుండడంతో కొండా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో ఎక్కడ యాత్ర నిర్వహించినా 10 నుంచి 20 మందికి మించి రాకపోవడం గమనార్హం. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు సభలు, సమావేశాలతో ప్రచారం నిర్వహిస్తుంటే, క్షేత్రస్థాయి ప్రచారంలో బీజేపీ అభ్యర్థి ముందున్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి క్షేత్రస్థాయి ప్రచారంలో దూసుకుపోతున్నాననే సంతృప్తి తప్పా.. జనాలు పెద్దగా రాకపోవడంతో ప్రతిచోటా అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. కొండా ఆశీర్వాద యాత్రలో స్థానికుల కంటే ఆయన దగ్గర పనిచేసే ఉద్యోగులే ఎక్కువగా కనిపిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే ప్రచారానికి వచ్చే కొద్దిపాటి జనాన్ని కూడా నమ్మించేందుకు ఆయన పడరాని పాట్లు పడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మొదటిసారి పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ప్రజలు గెలిపించారు. అయినా చేవెళ్ల నియోజకవర్గానికి ఏ ఒక్క ప్రాజెక్టు తీసుకురాలేకపోయారు. అంతేకాకుండా సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలు కొండా ఇంటికెళ్లితే.. అపాయింట్‌మెంట్ ఉందా అంటూ కోపమై వెనక్కి పంపారని, మరోసారి ఆయనకు ఓటేసేది లేదని ప్రజలు చర్చించుకుంటున్నట్లు తెలుస్తున్నది.

### జనసమీకరణకు టోకెన్లు..

బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రచారంలో పడరాని కష్టాలు పడుతున్నారు. ఆశీర్వాద యాత్ర చేపట్టిన నాటి నుంచి స్థానిక నేతలు, క్యాడర్ తీరుతో తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తున్నది. ఓ వైపు జనాలు రాకపోవడం, మరోవైపు ఉన్న కొద్దిపాటి క్యాడర్‌లో వర్గపోరు ఉండడంతో ఆశీర్వాద యాత్ర ఎందుకు చేపట్టానని లోలోపల బాధ పడుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా అసంతృప్తితోనే యాత్రలో భాగంగా కొందరిపై అందరి ముందే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల యాలాల మండలంలో ఆశీర్వాద యాత్రలో భాగంగా ఆయన మాట్లాడుతుండగా.. మండుటెండకు రక్షణగా స్థానిక నాయకుడు ఒకరు కాషాయ టోపీ కొండా తలపై పెట్టేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా సదరు నాయకుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొట్టినంత పనిచేశారు. పక్కన ఉన్న మరో నాయకుడు టోపీ పెట్టే ప్రయత్నం చేసిన నాయకుడిని కొద్దిసేపు మాట్లాడకు అంటుండగా, కొండా కలుగజేసుకొని తనను మాట్లాడొద్దని తమవాళ్లు అంటున్నారన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వీడియో చూసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలో ఎలాంటి మార్పు రాలేదు, ఆయనను మళ్లీ గెలిపిస్తే ఇక మన పని అంతే అంటూ చర్చించుకుంటున్నారు. అయితే ఆశీర్వాద యాత్రకు జనసమీకరణ కోసం ఎక్కడైతే యాత్ర చేస్తారో అక్కడి స్థానిక నేతకు టోకెన్లు అందుతున్నాయి. యాత్ర షురూ అయిన వెంటనే జనాలకు టోకెన్లు ఇచ్చి ప్రచారం ముగిసిన అనంతరం టోకెన్లు తీసుకొని రూ.200 చొప్పున ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. డబ్బులిస్తున్నా స్థానిక నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో కొండా అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు.

### రెండు, మూడు గ్రూపులు...

బీజేపీకి క్యాడర్ లేకున్నా ఉన్న కొద్దిపాటి నాయకుల్లో రెండు, మూడు గ్రూపులుండడం గమనార్హం. దీంతో ఏ గ్రూపును దగ్గర తీస్తే ఏ గ్రూపు దూరం అవుతుందనే భయంతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతమతమవుతున్నారు. పరిగి నియోజకవర్గంలో మూడు గ్రూపులున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన బూనేటి కిరణ్‌కుమార్ వర్గం, పరమేశ్వర్‌రెడ్డి వర్గం, కరణం ప్రహ్లాద్‌రావు వర్గం ఇలా క్యాడర్ లేకున్నా మూడు వర్గాలతోపాటు మూడు వర్గాలకు వేర్వేరుగా కార్యాలయాలు ఉండడం గమనార్హం. మరోవైపు వికారాబాద్ నియోజకవర్గంలో ప్రస్తుత బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డితోపాటు మొన్నటి వరకు అధ్యక్షుడిగా పనిచేసిన సదానంద్‌రెడ్డి గ్రూపులున్నాయి. అదేవిధంగా తాండూరు నియోజకవర్గంలో పటేల్ రవిశంకర్ వర్గం, రమేశ్ వర్గానికి చెందిన రెండు గ్రూపులున్నాయి.

## ఓటును మించిన ఆయుధం లేదు

**ఓటరు అవగాహన రన్‌ను ప్రారంభించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్**

- మే 13న ప్రతి ఓటరు ఓటింగ్‌లో పాల్గొనాలి : హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్
- శేరిలింగంపల్లి ప్రజానీకం చైతన్యం చూపాలి : రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- ఉత్సాహంగా సాగిన 2కె రన్

రంగారెడ్డి, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ)/కొండాపూర్, ఏప్రిల్ 10 : ఓటును మించిన ఆయుధం లేదని, ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం శేరిలింగంపల్లి జోన్ కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుంచి హైటెక్స్ రోడ్ మెటల్ చార్మినార్ వరకు 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో నిర్వహించిన 2కె రన్ ఉత్సాహంగా సాగింది. వివిధ వర్గాల వారు స్వచ్ఛందంగా 2కె రన్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతిని చాటారు. అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్లు, యువత, దివ్యాంగులు, వాకర్స్ అసోసియేషన్స్, సైకిలిస్ట్ అసోసియేషన్స్, పోలీసులు, విద్యార్థులు పెద్ద ఎత్తున 2కె రన్‌లో భాగస్వాములయ్యారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుంచి ప్రారంభమైన 2కె రన్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి కీలకమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో 3.30 కోట్ల ఓటర్లు ఉన్నారని, ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనట్లైతే ఓటు వృథా అవుతుందన్నారు. పద్దెనిమిదేండ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరును నమోదు చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం కల్పిస్తున్న అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాధ్యతగల పౌరులుగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని,'సి'విజిల్ యాప్‌ను మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోపు విచారణ చేసి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. 2కె రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోవారిని, చుట్టుపక్కల వారిని తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చైతన్యపర్చాలన్నారు.

### బుల్లెట్ కన్నా బ్యాలెట్ పవర్ గొప్పది..

బుల్లెట్ కన్నా బ్యాలెట్ పవర్ గొప్పదని, మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. హైదరాబాద్ నగరం అన్నింటా ముందున్నప్పటికీ ఓటింగ్ శాతంలో 50 శాతం మించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతమైనప్పటికీ, అందరూ చదువుకున్న వాళ్లు ఉన్నప్పటికీ ఓటు వేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నది లేనిది చెక్ చేసుకోవాలని, లేనట్లయితే ఈ నెల 15లోగా ఫారం-6లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ఉన్న వారందరూ మే 13న జరిగే పోలింగ్ ప్రక్రియలో పాల్గొని స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు.

### నియోజకవర్గంలో ఏడు లక్షలకుపైగా ఓటర్లు..

శేరిలింగంపల్లి పెద్ద నియోజకవర్గమని, ఏడు లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారని రంగారెడ్డి కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. ఆదాయం, చదువులో మాత్రమే కాదు.. సామాజిక బాధ్యతలో కూడా ముందున్నామని ఇక్కడి ప్రజానీకం నిరూపించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని, ఓటర్ సర్వీస్ పోర్టల్‌లో ఓటర్లు తమ వివరాలను చెక్ చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా ఇంటిలో, ఆఫీసుల్లో, బంధువులు, స్నేహితులకు అవగాహన కల్పించి చైతన్యపర్చాలని కోరారు. 2కె రన్ అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. 2కె రన్‌లో టాప్‌గా నిలిచిన ఐదుగురికి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీశ్, ఏసీపీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై..

# 100 రోజుల్లోనే వ్యతిరేకత

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి**

వికారాబాద్, ఏప్రిల్ 10 : అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకున్నదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, పార్లమెంట్ ఎన్నికల వికారాబాద్ కో-ఆర్డినేటర్ పి.కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. పాత ప్రభుత్వమే బాగుండేదని జనం ఆలోచనలో పడ్డారన్నారు. అవకాశం, స్వార్థం కోసం రంజిత్‌రెడ్డి పార్టీ మారారని, ప్రజలే ఈ ఎన్నికల్లో గట్టిగ బుద్ధి చెబుతారన్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న చేవెళ్ల సమీపంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉన్నట్లు తెలిపారు. ఈ సభకు లక్షలాదిగా జనం తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని పూర్తి చేయలేదని, రూ.500 గ్యాస్, ఉచిత కరెంట్ పూర్తిస్థాయిలో అమలుకాలేదన్నారు. ఇప్పటి వరకు ఎంతమందికి రైతుబంధు ఇచ్చారో చెప్పాలన్నారు. నేడు ప్రజలంతా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో చేసిన వ్యాఖ్యలతోనే తాను బలహీనంగా ఉన్నాడని చెప్పకనే చెబుతున్నట్లుగా ఉన్నదన్నారు. సీఎం హయాంలో ఒక నాయకుడు పార్టీలో చేరితే ఆ పార్టీ నాయకులే చెల్లదంటూ చెబుతుండడం చూస్తే కాంగ్రెస్‌లో అంతర్గతంగా కుమ్ములాటలు ఎలా ఉన్నాయో అర్థమవుతుందన్నారు.

### కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు రాజకీయంగా ఎవరికీ తెలియదు..

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు రాజకీయంగా ఎవరికి తెలియదని, కేసీఆర్ బొమ్మ మీదనే గెలిచారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, అనిల్, శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు గోపాల్, అనంత్‌రెడ్డి, నాయకులు మేక చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గిరీశ్‌కొఠారీ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పార్లమెంట్ ఎన్నికల పార్టీ వికారాబాద్ కో-ఆర్డినేటర్ పి.కార్తీక్‌రెడ్డి

**తక్కువ ఓటింగ్ నమోదు అవుతున్న లోక్‌సభ స్థానాలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఫోకస్ పెట్టింది. 2019 సాధారణ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా తక్కువ ఓటు శాతం నమోదైన నియోజకవర్గాలను ఈసీ గుర్తించగా.. అందులో చేవెళ్ల పార్లమెంట్ స్థానం ఉన్నది. ఈసీ మార్గనిర్దేశం మేరకు ఇక్కడ ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసి అమలు చేస్తున్నది. స్వీప్ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నది. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బుధవారం 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మరోపక్క కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఈ నెల 15 వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.**

-రంగారెడ్డి, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ)




# ఓటుకు.. పట్టం కట్టేలా..

- చేవెళ్ల లోక్‌సభ స్థానంపై ఈసీ ప్రత్యేక దృష్టి
- 2019 ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ పరిధిలో 53.22 శాతం ఓటింగ్ నమోదు

లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానం పరిధిలో తక్కువ ఓటింగ్ నమోదవుతూ వస్తున్నది. ఈ ఎంపీ స్థానంలో చాలావరకు అసెంబ్లీ నియోజకవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తాయి. 2014 ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ పరిధిలో 60.05 శాతం నమోదు కాగా.. 2019 ఎన్నికలకు వచ్చేసరికి పోలింగ్ శాతం 53.22 శాతానికి తగ్గింది. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ రంగారెడ్డి జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తక్కువ పోలింగ్ నమోదైంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 62 శాతం పోలింగ్ నమోదుకాగా.. 2023 ఎన్నికల్లో 59.96 శాతం మాత్రమే నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా.. పట్టణాల్లోని ఓటర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఈ రెండు ఎన్నికల మధ్య పోలింగ్ శాతం తగ్గింది. తాజా ఎన్నికల్లో.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 74.93 శాతం, ఎల్బీనగర్ పరిధిలో 49.07, మహేశ్వరంలో 55.39, రాజేంద్రనగర్‌లో 55.83, శేరిలింగంపల్లిలో 48.75, చేవెళ్ల పరిధిలో 74.18, కల్వకుర్తిలో 83.26, షాద్ నగర్‌లో 82.09 శాతం పోలింగ్ నమోదైంది.

- ఈసీ ఆదేశాలతో పోలింగ్ శాతం పెంపునకు ప్రత్యేక కార్యాచరణను మొదలుపెట్టిన జిల్లా యంత్రాంగం
- స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
- పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యంతో 'సంకల్ప' పత్రాలతో ప్రచారం
- ఈనెల 15 వరకు ఓటు నమోదుకు అవకాశం

### ఓటింగ్ శాతం పెంపునకు మూడంచెల వ్యూహం..

పోలింగ్ రోజున పట్టణ వాసులు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా యువత ఓటేసేందుకు ఆసక్తి చూపడంలేదు. పోలింగ్ రోజున సెలవు ప్రకటించడంతో చాలామంది సెలవు దినాన్ని ఓటు హక్కుకోసం వినియోగించుకోక ఇంటి పట్టునే ఉంటున్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లను వేర్వేరు పోలింగ్ బూతులకు కేటాయించడం, క్యూలో వెయిట్ చేయడం వంటి కారణాలు తక్కువ ఓటింగ్‌కు కారణమవుతున్నాయని ఎన్నికల సంఘం గుర్తించింది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతోపాటు, ముఖ్యంగా యువతను ఇందులో భాగస్వామ్యులను చేసేలా ప్రత్యేక కార్యాచరణను చేపట్టాలని ఎన్నికల సంఘం సూచించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా యంత్రాంగం ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు మూడంచెల వ్యూహాన్ని అమలు చేయనున్నది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భిన్నమైన వ్యూహాలను అమలుపర్చనున్నారు. పోలింగ్ బూతుల్లో క్యూ నిర్వహణ, వాహనాల పార్కింగ్ వసతులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్థానిక ప్రముఖులు, యువతపై ప్రభావం చూపే వ్యక్తుల ద్వారా ఓటర్లను బూత్‌లకు రప్పించేలా కార్యాచరణను సిద్ధం చేశారు.

### స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు..

లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపునకు స్వీప్(సిస్టమెటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బుధవారం 2కె రన్ నిర్వహించి ఓటర్లను చైతన్యపర్చారు. విద్యార్థులు, యువతతోపాటు ఐటీ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకునేలా సమావేశాలు నిర్వహించి ఓటు ప్రాధాన్యతను వివరిస్తున్నారు. ఈసారి కొత్తగా పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యులను చేసి 'తెలంగాణ ఓటరు సంకల్ప పత్రం' పేరుతో వినూత్న ప్రచారాన్ని అధికారులు చేపడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు సంకల్ప పత్రాలను అందజేసి వారి ద్వారా ఓటు ఆవశ్యకతపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. పత్రాలపై తల్లిదండ్రులతో సంతకాలు చేయించాక తిరిగి ఆ పత్రాలను పాఠశాలల వారీగా స్వీప్ అధికారులు సేకరిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మొబైల్ వాహనాల ద్వారా ఓటు విలువ, పోలింగ్ సమాచారం, ఇతర వివరాలను కళాబృందాలతో విస్తృత ప్రచారాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోపక్క వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులతో ఓటు విలువ తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15 వరకు కొత్తగా ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించడంతో.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా అధికారులు చైతన్యపరుస్తున్నారు.